ఫైనల్లో భారత్

సెమీస్‌లో ఇంగ్లండ్‌పై ప్రతీకార విజయం

అక్షర్, కుల్దీప్ స్పిన్ తంత్రం

ఇంగ్లండ్ 103 ఆలౌట్

రాణించిన రోహిత్, సూర్యకుమార్

టీ20 ప్రపంచకప్‌లో సరిగ్గా పదేండ్ల తర్వాత భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సుదీర్ఘ కలను సాకారం చేసుకునే క్రమంలో రోహిత్‌సేన టైటిల్‌ను ముద్దాడేందుకు మరో అడుగుదూరంలో నిలిచింది. సరిగ్గా రెండేండ్ల క్రితం మెగాటోర్నీలో తమకు ఎదురైన పరాజయానికి ఇంగ్లండ్‌పై టీమ్‌ఇండియా కసితీరా ప్రతీకారం తీర్చుకుంది. వర్షం అంతరాయం మధ్య సాగిన సెమీస్ పోరులో డిఫెండింగ్ చాంపియన్‌ను మట్టికరిపిస్తూ రోహిత్‌సేన విజయఢంకా మోగించి సఫారీలతో ఆఖరి పోరుకు సిద్ధమైంది. రోహిత్, సూర్యకుమార్ సాధికారిక ఇన్నింగ్స్‌తో కదంతొక్కారు. ఇంగ్లిష్ బౌలర్లను ఇరుగదీస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. కోహ్లీ, పంత్, దూబే విఫలమైనా..ఆఖర్లో పాండ్యా చెలరేగడంతో పోరాడే స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో అక్షర్‌పటేల్, కుల్దీప్ స్పిన్ తంత్రంతో ఇంగ్లండ్ స్వల్ప స్కోరుకే కుప్పకూలింది. బ్రూక్, బట్లర్ మినహా అందరూ విఫలమయ్యారు.

అక్షర్‌పటేల్ (3/23)

జార్జ్‌టౌన్(గయానా): ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. గురువారం పలుమార్లు వర్షం అంతరాయం మధ్య ఆగుతూ సాగిన మ్యాచ్‌లో 68 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన ఇంగ్లండ్..భారత్‌ను బ్యాటింగ్‌ను ఆహ్వానించింది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో మైదానం చిత్తడిగా మారడంతో ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్..లక్ష్యఛేదన వైపు మొగ్గుచూపాడు. కెప్టెన్ రోహిత్‌శర్మ(39 బంతుల్లో 57, 6ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు సూర్యకుమార్‌యాదవ్(36 బంతుల్లో 47, 4ఫోర్లు, 2సిక్స్‌లు) రాణించడంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 171/7 స్కోరు చేసింది. మిడిలార్డర్‌లో హార్దిక్‌పాండ్యా(23) ఫర్వాలేదపించగా, దూబే(0), పంత్(4), కోహ్లీ(9) ఘోరంగా నిరాశపరిచారు. క్రిస్ జోర్డాన్(3/37)కు మూడు వికెట్లు దక్కాయి. లక్ష్యఛేదనలో స్పిన్నర్లు అక్షర్‌పటేల్(3/14), కుల్దీప్‌యాదవ్(3/19) ధాటికి ఇంగ్లండ్ 16.4 ఓవర్లలో 103 పరుగులకు కుప్పకూలింది. అక్షర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

రాణించిన రోహిత్, సూర్య:

హిట్‌మ్యాన్ రోహిత్..మెగాటోర్నీలో తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఓవైపు విరాట్ కోహ్లీ వరుస వైఫల్యాలతో ఇబ్బందిపడుతున్న వేళ..నాయకునిగా జట్టు బ్యాటింగ్ భారాన్ని భుజాన వేసుకున్నాడు. తాను ఎదుర్కొన్న రెండో బంతినే బౌండరీగా మలిచిన రోహిత్..ఎక్కడా వెనుకకు తగ్గలేదు. మరో ఎండ్‌లో టోప్లె బౌలింగ్‌లో కండ్లు చెదిరే సిక్స్‌తో టచ్‌లోకి వచ్చినట్లు కనిపించిన కోహ్లీ ఆ మరుసటి బంతికే క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన పంత్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలదొక్కుకోలేకపోయాడు. భారీ షాట్ ఆడబోయిన పంత్..బెయిర్‌స్టో క్యాచ్‌తో ఔటయ్యాడు. ఓ ఎండ్‌లో వికెట్లు పడుతున్నా..రోహిత్ తన జోరు తగ్గించలేదు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 46/2 స్కోరు చేసింది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని నైజంతో హిట్‌మ్యాన్ బౌండరీలతో చెలరేగడంతో స్కోరు ఊపందుకుంది. మరోవైపు సూర్యకుమార్ కూడా బ్యాటు ఝుళిపించడంతో పరుగుల రాకసులువైంది. కరాన్ 13వ ఓవర్‌లో సూపర్ సిక్స్‌తో రోహిత్ 36 బంతుల్లో రోహిత్ అర్ధసెంచరీ మార్క్ అందుకుంది. అయితే మరుసటి ఓవర్‌లోనే కెప్టెన్ రషీద్ బౌలింగ్‌లో రోహిత్ ఔటయ్యాడు. దీంతో మూడో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. అదే దూకుడు కొనసాగిస్తాడనుకున్న సూర్యకుమార్ కూడా రోహిత్‌ను అనుసరించడంతో ఒకింత మందగించింది. ఆఖర్లో పాండ్యా, జడేజా బ్యాటింగ్‌తో భారత్ పోరాడే స్కోరు అందుకుంది.

అక్షర్, కుల్దీప్ స్పిన్ హవా: లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ దూకుడు కనబరిచేందుకు ప్రయత్నించింది. అర్ష్‌దీప్‌సింగ్ వేసిన మూడో ఓవర్లో బట్లర్ మూడు ఫోర్లతో తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన అక్షర్‌పటేల్ తొలి బంతికే బట్లర్‌ను బోల్తా కొట్టించాడు. షాట్ ఆడే క్రమంలో కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇక్కణ్నుంచి ఇంగ్లండ్ స్పిన్ ఉచ్చులో చిక్కుకుంది. సాల్ట్(5)ను బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేయగా, బెయిర్‌స్టో(0)ను అక్షర్..డకౌట్‌గా పెవిలియన్ పంపాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి ఇంగ్లండ్ 39/3 చేసింది. అప్పటికే పిచ్‌పై పూర్తి అవగాహనకు వచ్చిన కెప్టెన్ రోహిత్..స్పిన్నర్లతో ఇంగ్లండ్ పనిపట్టాడు. మరో ఎండ్‌లో కుల్దీప్ చెలరేగడంతో మొయిన్ అలీ(8), కరాన్(2), బ్రూక్, జోర్డాన్(1) వెంటవెంటనే నిష్క్రమించారు. స్పిన్నర్ల విజృంభణతో ఇంగ్లండ్ బ్యాటర్లు కనీసం క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. ఆర్చర్‌తో సమన్వయ లోపంతో లివింగ్‌స్టోన్(11), రషీద్(2) రనౌట్ అయ్యారు. ఆర్చర్(21) పోరాడినా ఫలితం లేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు:
భారత్: 20 ఓవర్లలో 171/7(రోహిత్ 57, సూర్యకుమార్ 47, జోర్డాన్ 3/37, రషీద్ 1/25). **ఇంగ్లండ్:** 16.4 ఓవర్లలో 103 ఆలౌట్(బ్రూక్ 25, బట్లర్ 23, కుల్దీప్ 3/19, అక్షర్‌పటేల్ 3/23)

కిరణ్‌కు ఒలింపిక్ బెర్తు

పంచకుల(హర్యానా): ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు భారత యువ అథ్లెట్ కిరణ్ పహల్ అర్హత సాధించింది. జాతీయ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం జరిగిన మహిళల 400మీటర్ల రేసును 50.92 సెకన్లలోముగించడం ద్వారా విశ్వక్రీడల బెర్తు దక్కించుకుంది. ఇదే పోటీలో పాల్గొన్న దేవిఅనిబ (53.44సె), స్నేహ (53.51సె) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచారు. 400మీటర్ల విభాగంలో అర్హత మార్క్‌ను 50.95సెకన్లుగా నిర్ణయించగా, కిరణ్ తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది.

మహిళల టెస్టు పోరు

నేటి నుంచి భారత్,దక్షిణాఫ్రికా ఏకైక టెస్టు • ఉ:9.30 నుంచి స్పోర్ట్స్-18లో

చెన్నై: భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్టు పోరుకు రంగం సిద్ధమైంది. గురువారం నుంచి ఇరు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్‌కు తెరలేవనుంది. దాదాపు పదేండ్ల తర్వాత తొలిసారి తలపడుతున్న పోరులో ఎలాగైనా ఆధిపత్యం చెలాయించాలని రెండు జట్లు పట్టుదలతో ఉన్నాయి. మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా జోరు మీదుంటే..సుదీర్ఘ ఫార్మాట్‌లో దీటైన పోటీనిచ్చేందుకు సఫారీలు సై అంటున్నారు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో సత్తాచాటిన పలువురు యువ క్రికెటర్లు టీమ్ ఇండియా తరపున అరంగేట్రం చేయనున్నారు. స్వదేశం వేదికగా చివరిసారి ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో ఆడిన రెండు టెస్టుల్లో భారత్ చిరస్మరణీయ విజయాలు సాధించింది. ఇదిలా ఉంటే నాయక ద్వయం హర్మన్‌ప్రీత్, మందన సూపర్‌ఫామ్‌మీద ఉండటం భారత్‌కు కలిసిరానుంది.

దక్షిణాఫ్రికా దర్జాగా..

తొలిసారి ఫైనల్‌లో సఫారీలు

సెమీస్‌లోనే ముగిసిన అఫ్గానిస్థాన్ పోరాటం

56 పరుగులకే ఆలౌట్

ఐసీసీ టోర్నీలలో కప్పు కొట్టాలన్న చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశలో దక్షిణాఫ్రికా ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఏండ్లుగా వేధిస్తున్న 'సెమీస్ గండాన్ని' ఆ జట్టు విజయవంతంగా అధిగమించి తమపై ఉన్న 'చోకర్స్' ముద్రను చెరిపేసుకుంది. 1991లో అంతర్జాతీయ క్రికెట్‌కు రీఎంట్రీ ఇచ్చాక ఐసీసీ నిర్వహించే ప్రపంచకప్ (వన్డే, టీ20)లలో తొలిసారి ఆ (పురుషుల) జట్టు ఫైనల్స్‌కు అర్హత సాధించింది. బౌలర్లు చెలరేగడంతో సెమీస్‌లో సఫారీలు అఫ్గానిస్థాన్‌పై ఏకపక్ష విజయం సాధించారు. ఇక ఈ మెగా ఈవెంట్ ఆసాంతం అనూహ్య విజయాలు, అబ్బురపరిచే పోరాట పటిమతో మొదటిసారి వరల్డ్ కప్ సెమీఫైనల్ చేరిన అఫ్గాన్ పోరాటం సెమీస్‌లోనే ముగిసింది. బ్యాటింగ్ వైఫల్యంతో 'పఠాన్లు' అవమానకర ఓటమిని మూటగట్టుకున్నారు. జాన్సెన్, షంసీ, రబాడా, నోకియా ధాటికి కాబూలీ బ్యాటర్లు విలవిల్లాడి 56 పరుగులకే ఆలౌట్ అయ్యారు.

తరౌబా (ట్రినిడాడ్): సుదీర్ఘకాలంగా తమకు అందని ద్రాక్షగా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని దక్కించుకునే క్రమంలో దక్షిణాఫ్రికా మరో కీలక అడుగు వేసింది. బౌలర్లు విజృంభించడంతో తొలి సెమీఫైనల్‌లో సఫారీలు అఫ్గానిస్థాన్‌పై 9 వికెట్ల తేడాతో అఖండ విజయం సాధించి టైటిల్ పోరుకు సిద్ధమయ్యారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మార్కో జాన్సెన్ (3/16), తబ్రేజ్ షంసీ (3/6), కగిసో రబాడా (2/14), అన్రిచ్ నోకియా (2/7) విజృంభించంతో అఫ్గానిస్థాన్ 11.5 ఓవర్లలో 56 పరుగులకే ఆలౌట్ అయింది. అజ్మతుల్లా ఒమర్‌జయ్ (10) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా ఆ జట్టుకు వచ్చిన అదనపు పరుగులే (13) అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోర్ కావడం గమనార్హం. స్వల్ప ఛేదనను దక్షిణాఫ్రికా 8.5 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే నష్టపోయి ఛేదించింది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (23 నాటౌట్), రీజా హెంద్రిక్స్ (29 నాటౌట్) లాంఛనాన్ని పూర్తిచేశారు.

సఫారీ బౌలర్ల ధాటికి కుదేలు:

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గాన్ సారథి రషీద్ ఖాన్‌కు తానెంత తప్పు చేశాడో తెలియడానికి పెద్దగా టైం పట్టలేదు. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన ఆ జట్టు ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్.. జాన్సెన్ వేసిన తొలి ఓవర్లో ఆఖరి బంతికి స్లిప్స్‌లో రీజా హెంద్రిక్స్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. అప్పుడు మొదలైన వికెట్ల పతనం.. అఫ్గాన్ ఇన్నింగ్స్ ముగిసేదాకా నిరాటంకంగా సాగింది. జాన్సెన్ 3వ ఓవర్లో గుల్బాదిన్ (9)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. మరుసటి ఓవర్లో రబాడా.. జద్రాన్ (2)తో పాటు నబీ(0)ని పెవిలియన్‌కు పంపి అఫ్గాన్‌ను కోలుకోనీయలేదు. డబుల్ డిజిట్ స్కోరు చేసిన అజ్మతుల్లాను నోకియా 7వ ఓవర్లో బలిగొనగా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లెవరూ కనీసం పోరాడకుండానే వెనుదిరిగారు. షంసీ వరుస ఓవర్లలో మూడు వికెట్లు తీసి అఫ్గాన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఆడుతూ పాడుతూ..:

స్వల్ప ఛేదనను సఫారీలు ఆడుతూ పాడుతూ ఛేదించారు. రెండో ఓవర్లోనే ఓపెనర్ క్వింటన్ డికాక్ (5) వికెట్ కోల్పోయినా మరో ఓపెనర్ హెంద్రిక్స్, మార్క్‌రమ్ కలిసి అఫ్గన్‌కు ఎలాంటి అవకాశమివ్వకుండా మ్యాచ్‌ను ముగించారు. ఈ జోడీ రెండో వికెట్‌కు 55 పరుగులు జోడించింది.

సంక్షిప్త స్కోర్లు:
అఫ్గానిస్థాన్: 11.5 ఓవర్లలో 56 ఆలౌట్ (అజ్మతుల్లా 10, గుల్బాదిన్ 9, షంసీ 3/6, జాన్సెన్ 3/16). **దక్షిణాఫ్రికా:** 8.5 ఓవర్లలో 60/1 (హెంద్రిక్స్ 29 నాటౌట్, మార్క్‌రమ్ 23 నాటౌట్, ఫరూఖీ 1/11)

పదిరోజుల షూటింగే బ్యాలన్స్

రామ్‌చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'గేమ్ ఛేంజర్' సినిమా అప్‌డేట్ వచ్చేసింది. 'ఇండియన్ – 2' ప్రమోషన్‌లో భాగంగా దర్శకుడు శంకర్ ఇచ్చిన ఓ తాజా ఇంటర్‌వ్యూలో 'గేమ్‌ఛేంజర్' గురించి మాట్లాడారు. ' 'గేమ్ ఛేంజర్' దాదాపుగా పూర్తయింది. ఇంకో పదిరోజుల షూటింగ్ మాత్రమే మిగిలివుంది. 'ఇండియన్–2' హడావిడి ముగియగానే, 'గేమ్ ఛేంజర్' పని మొదలుపెడతా. ఫైనల్ అవుట్‌పుట్ చూసుకొని పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తా. సినిమాకు సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాకే విడుదల తేదీ ప్రకటిస్తాం' అని తెలిపారు శంకర్. సమకాలీన రాజకీయ సమస్యలే ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని శంకర్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో తండ్రీకొడుకులైన రామ్‌నందన్, అప్పన్నలుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న విషయం తెలిసిందే. అంజలి, కైరా అద్వానీ కథానాయికలుగా నటిస్తున్న ఈ సినిమాలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, సునీల్ కీలకపాత్రధారులు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా.

తమిళ ఎంట్రీకి బ్రేక్

కథానాయిక జాన్వీకపూర్‌కు దక్షిణాది అంటే ప్రత్యేకమైన అభిమానం. తన తల్లి శ్రీదేవి తరహాలోనే దక్షిణాదిలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలన్నది జాన్వీకపూర్ లక్ష్యంగా చెబుతారు. అందుకే ఇటీవలకాలంలో హిందీ చిత్రాలకంటే దక్షిణాదిపైనే దృష్టి పెడుతున్నది. తెలుగులో ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి అగ్ర హీరోల చిత్రాల్లో అవకాశాలు సంపాదించుకొని అందరిని ఆశ్చర్యపరిచింది జాన్వీకపూర్. అయితే ఈ అమ్మడి తమిళ ఎంట్రీకి మాత్రం అనూహ్యంగా బ్రేక్ పడింది. వివరాల్లోకి వెళితే.. తమిళంలో సూర్య కథానాయకుడిగా 'కర్ణ' పేరుతో భారీ పాన్ ఇండియా పౌరాణిక చిత్రానికి సన్నాహాలు చేశారు. రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా దర్శకుడు. ఈ చిత్రంలో జాన్వీకపూర్‌ను కీలక పాత్ర కోసం ఎంపిక చేశారు. కొద్ది రోజుల క్రితం ప్రీప్రొడక్షన్ వర్క్ కూడా మొదలుపెట్టారు. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిసింది. అనివార్య కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని చిత్ర బృందం పేర్కొంది. దీంతో జాన్వీకపూర్ తమిళ ఎంట్రీకి తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

చిత్రం



ఖైదీ నెంబర్ 63

అజిత్ కథానాయకుడిగా నటిస్తున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఖైదీగా అజిత్ సరికొత్త అవతారంలో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. అజిత్ కెరీర్‌లో బిగ్గెస్ట్ సినిమా ఇదని, యాక్షన్ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాకు కెమెరా: అభినందన్ రామానుజం, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, రచన–దర్శకతత్వం: అధిక్ రవిచంద్రన్.

రాగాల వేటలో రాజాసాబ్

దేశం మొత్తం ప్రస్తుతం 'కల్కి 2898ఏడీ' ఫీవర్‌తో ఉంది. ఎక్కడ విన్నా 'కల్కి' టాపిక్కే. వాతావరణం చూస్తుంటే ప్రభాస్ భారీ విజయాన్నే సొంతం చేసుకున్నట్టు కనిపిస్తున్నది. దీని ప్రభావం ప్రభాస్ తర్వాత సినిమాపై కచ్చితంగా ఉంటుంది. 'కల్కి 2898 ఏడీ' తర్వాత వచ్చే ప్రభాస్ సినిమా 'రాజాసాబ్'. దర్శకుడు మారుతీకి ఇది నిజంగా అగ్నిపరీక్షే. కానీ.. మారుతీ కూల్‌గా చెన్నయ్ మెరీనా బీచ్‌లో సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి 'రాజాసాబ్' బాణీల కూర్పులో తలమునకలై ఉన్నారు. ఇందులో మొత్తం అయిదు పాటలు ఉండగా, ఇప్పటికే మూడు పాటలకు ట్యూన్స్ ఇచ్చేశాడు తమన్. ఇంకా రెండు పాటలే మిగిలివున్నాయి. ప్రస్తుతం ఆ ట్యూన్స్ రాబట్టే పనిలో ఉన్నారు తమన్, మారుతి. 'బాహుబలి' ఫ్రాంచైజీ తర్వాత వందలకోట్ల బడ్జెట్‌తో పాన్ ఇండియా సినిమాలు మాత్రమే చేస్తూ వస్తున్న ప్రభాస్.. కాస్త విరామం తర్వాత పూర్తిస్థాయి తెలుగు హారర్ కామెడీతో 'రాజాసాబ్' చేస్తున్నారు. ఈ సినిమాను తొలుత వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలనుకున్నారు. కానీ.. ఇంకా తీయాల్సిన షూటింగ్ చాలా ఉండటంతో వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

కల్యాణ్‌రామ్ మెరుపు?

హీరో కల్యాణ్ రామ్ త్వరలో 'మెరుపు'లా రానున్నారా? అంటే ఫిల్మ్ వర్గాలు అవుననే అంటున్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రానికి 'మెరుపు' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని తెలుస్తున్నది. గతంలో రామ్‌చరణ్ హీరోగా ధరణి దర్శకత్వంలో మొదలైన ఓ చిత్రానికి ఇదే టైటిల్ అనుకున్నారు. అయితే.. ఆ సినిమా మధ్యలోనే ఆగిపోయింది. తర్వాత కూడా ఎవరూ ఆ టైటిల్‌తో సినిమా చేయలేదు. ఇన్నాళ్లకు కల్యాణ్‌రామ్‌కు ఆ టైటిల్ కుదిరింది. ముప్పా వెంకయ్య చౌదరి, ముప్పా అశోక్ వర్ధన్, సునీల్ బులుసు కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాయి మంజ్రేకర్ కథానాయిక. మహేశ్ 'సరిలేరు నీకెవ్వరు' తర్వాత మళ్లీ విజయశాంతి ఇందులో నటిస్తున్నారు. ఇందులో ఆమె వైజయంతీ ఐపీఎస్‌గా పోలీస్ అధికారి పాత్ర పోషిస్తుండటం విశేషం. భారీ విరామం తర్వాత విజయశాంతిని మళ్లీ పోలీస్ డ్రెస్‌లో చూడబోతున్నామన్నమాట. కల్యాణ్‌రామ్ పాత్ర కూడా ఇందులో పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నదట. కార్పొరేట్ లుక్‌తో స్టైల్‌గా ఆయన ఇందులో కనిపించనున్నారని మేకర్స్ చెబుతున్నారు.

ఆనందం తనలో కనిపిస్తుంది

యూత్‌లో విశేషమైన క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక డింపుల్ హయతి. ప్రస్తుతం ఆమె చేతిలో సినిమాలేం లేవు. కానీ క్రేజ్ మాత్రం ఓ రేంజ్‌లో ఉంటుంది. కారణం ఆమె అందమే. ముఖ్యంగా ఆమె ఒంపుసొంపులకు ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. ఇన్‌స్టాలో అప్పుడప్పుడు డింపుల్ పెట్టే పోస్ట్‌లకు వ్యూస్ లక్షల్లో ఉంటాయి. రీసెంట్‌గా తను ఓ పోస్ట్ షేర్ చేసింది. 17రోజుల పాటు తీవ్రంగా కసరత్తు చేసి 3 కేజీలు బరువు తగ్గినట్టు ఈ పోస్ట్ ద్వారా పేర్కొన్నది డింపుల్ హయతి. దీనికి సంబంధించిన వీడియోను కూడా షేర్ చేసింది. 'గ్లింప్స్ ఆఫ్ హార్డ్ వర్క్' అంటూ పైన కొటేషన్ కూడా జత చేసింది. అంతేకాదు, తన ఫిట్నెస్ ట్రైనర్ తరుణ్ శోలరాజన్‌ని తన ఫాలోవర్స్‌కీ, అభిమానులకు ఇన్‌స్టా ద్వారా పరిచయం చేసింది డింపుల్. ఈ వీడియోస్ చూసినవారంతా డింపుల్‌ను అభినందిస్తున్నారు. 17రోజుల్లో మూడు కేజీలు తగ్గడమంటే సాధారణమైన విషయంకాదని, ఆ ఆనందం తన ముఖంలో కనిపిస్తున్నదని పలువురు అభిప్రాయం వెలిబుచ్చారు.

సరికొత్త ప్రేమకథ 'నేను-కీర్తన'

స్వీయ దర్శకత్వంలో చిమటా రమేష్ బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను-కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. రిషిత, మేఘన కథానాయికలు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలో 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం' అనే ప్రత్యేక గీతాన్ని ఇటీవల సీనియర్ నటుడు మురళీమోహన్ విడుదల చేశారు. అందమైన ప్రేమకథా చిత్రమిదని, కులుమనాలిలో చిత్రీకరించిన పాటలు హైలైట్‌గా నిలుస్తాయని, యాక్షన్ ఘట్టాలు కూడా మెప్పిస్తాయని హీరో చిమటా రమేష్ బాబు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కె.రమణ, సంగీతం: ఎం.ఎల్.రాజా, రచన–దర్శకత్వం: చిమటా రమేష్‌బాబు.